కొత్త పుట

రమణయ్యపంతుల్ని ఒకమాటుచూస్తే మరచిపోలేము. చిన్నపిల్లలకు ఆయనంటే ఎంతభయమో అంత అభిమానం. లావుగా, పొడుగ్గా, పెద్దబొజ్జా, పలచటి తలకట్టూ, పిలక, ఎత్తుపళ్లూ ఆ విచిత్రమైన ఆకారం - పంచ, జుబ్బా, కండువా వేసుకొని వీధిలో నడచివస్తుంటే బడిపిల్లలకు హడలు.

బడిదొంగలు ఇంట్లోదాగివుంటే తల్లులు బయటికొచ్చి పంతులుగార్ని ఇంట్లోకిపిలిచి వాళ్ళను అప్పగించేవారు. "ఏం రా వెధవా బడిమానేస్తే చదువుసంధ్యలు అంటక తరువాత దమ్మిడీకి మారవు. అడుక్కు-తినాలి తెలుసా ?" అని ఆయన మందలిస్తుంటే పిల్లల్ని "అదీ ... అలాబుద్ధిచెప్పండి బాబూ, మరీ పెంకివెధవై చేతికిరాకుండా పోతున్నాడు. వీడికి చదువు ఏలా వస్తుందో అంతుపట్టకుండా ఉంది" అని తల్లులు బెంగపెట్టుకుంటే, "మీకేం భయంలేదమ్మా చిన్నతనం, వాడి వంశంలో మహావిద్వాంసులు జన్మించారు. వీడితాతగారు నాకు తెలుసు, గొప్ప పండితుడు. బహుదొడ్డ మనిషి" అని ఊరడించి దాహానికి ఇన్ని మజ్జిగపుచ్చుకొని, కూరగాయలో, తాటిముంజలో, అల్లమో బెల్లమో ఏదోఒకటి మూటగట్టుకొని మళ్ళీ వీధినపడేవాడు.

ఆ రోజులేవేరు ! పెంకిపిల్లలు తనకు పేర్లుపెట్టడం వంటి పాడుపనులు చేసినా ఆయనకు ఆ ఉద్యోగం బాగుండేది.

ఊళ్ళో ఎంతో ఆదరముండేది. ఎవరింటనైనా యేదైనా ఒక కార్యం తలపెట్టుకొని వంటబ్రాహ్మణుడు రాకపోతే రవణయ్య సాయం కోరేవారు. ఆయన వంటంతా అవలీలగా చేసేవాడు. ఆయన ఫలానా పెళ్ళిలో గంపెడు బూర్లు తిన్నాడనీ, ఆయన్ని గురించి రకరకాలుగా కథలు చెప్పుకుంటుంటారు. అయినా ఊళ్ళో ఏ కార్యం జరిగినా తా నుండవలసిందే.

ఇప్పుడు రోజులు మారిపోయ్యాయి. ఇప్పుడు అలాంటి కర్మిష్ఠులూ లేరు. అటువంటి కార్యాలూ లేవు.

జవసత్త్వాలుడిగినరాత్రి వెలవెలబోతూ పండుటాకులా రాలిపోతున్నది. పెరటివైపు చింతచెట్లమీద పక్షులు కిలకిల మంటున్నాయి. పక్కమీద దొర్లుతూ రవణయ్య ముసుగు తొలగించేసరికి, తెల్లటి వెలుతురు గవాక్షంలోనుంచి వచ్చి అతని ముఖంమీద పడ్డది. మగతనిద్రలో తెగిపోయిన వేరులా చెదిరిపోతున్న ఆలోచనల్ని కూడదియ్యటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

"ఒరే తమ్ముడూ తెల్లారింది ఏమిటా పడక, వేగం లే. ఇవ్వాళ నీ పుట్టినరోజుకూడా" అన్నది రవణయ్య అక్కగారు.

"ఏమిటే పుట్టినరోజా. నే నెప్పుడు పుట్టానంటావు?" రవణయ్య మంచంమీద లేచికూర్చున్నాడు.

"నువ్వుపుట్టి అరవయ్యేళ్ళు. ఇవ్వాళ షష్టిపూర్తిరా నీకు ... లే తలంటుకుందువుగాని"

"అయితే మనమింకా చిన్నవాళ్ళమేనన్నమాట ...

"అయ్యో చిన్నతనం కాక మరేమిట్రా, తొందరపడి వాళ్ళు ఉద్యోగం తీసేశారుగాని ..."

"ఉద్యోగం ఏనాడైపోయింది? నీ లెక్క ప్రకారం నా ఉద్యోగం ఏభయ్యేవటనే పోయింది. అప్పటికి నాకు రిటైరయ్యే వయస్సు వచ్చిందని వాళ్ళు లెక్కలుగట్టారు. కాదంటే ఋజువు చేసుకోమన్నారు. రుజువులూ సాక్ష్యాలూ మనదగ్గ రేమున్నాయి గనుక-జాతకచక్ర మేనా లేదాయిరి. నీ సాక్ష్యం వాళ్ళకు పనికిరాదుట. నాపుట్టుపూర్వోత్తరాలు ఎరిగినదానివి నువ్వేనాయె. అయితే అక్కయ్యా నీ కెన్నేళ్ళు ... ఇప్పుడు?"

"అయ్యో నా బతుకుమండా? అడక్కడక్క నా సంగతే అడిగావూ? తాటిచెట్టుకు ఎన్నేళ్ళంటే నేమిట్రా?"

రవణయ్యకు నవ్వొచ్చింది. తాటిచెట్టుమాత్రం పనికి రాదూ? ప్రతిచెట్టువల్లా ఏదో ఒక ఉపయోగముంది ఎక్కువ తక్కువలు, కాస తారతమ్యాలుంటాయి అంతే. ఆ సంగతి రవణయ్య చెబుదామనుకున్నాడుగానీ ఆవిడ చెవినపెట్టదని ఊరుకున్నాడు. తన్ను పెంచి పెద్దచేసింది. ఆవిడ లేకుంటే తను ఏమయ్యేవాడో!

"లేరా తమ్ముడూ తలంటుతాను. వేగం బజారుకెళ్ళి వద్దువుగాని ..."

"ఎందుకూ బజారుకి?" బజారంటేనే భయం రవణయ్యకు.

"సన్నబియ్యం, పప్పూ, ఓ కొబ్బరికాయ పట్టుకురారా. అంత పిండివంటకూడా చేస్తాను"

రవణయ్యకు ఏ పిండివంటో అడగా లనిపించింది. కాని అడగడ మెందుకని వూరుకున్నాడు.

కాలకృత్యాలుతీర్చుకొని యథావిధిగా దేవతార్చన ముగించుకొన్నాడు రవణయ్య. దంతధావనం దగ్గర్నుంచీ అనుష్ఠానందాకా అన్నీ గడియారంముల్లులా జరిగిపోయాయి. కండువా వేసుకొని గడపదగ్గరకొచ్చి, మళ్ళీ ఒకఅడుగు లోపలికి వేసి, అక్కగార్ని పిలిచి నతమస్తకుడై నమస్కారంచేశాడు. తమ్ముణ్ణి చూచుకొని మురిసిపోయింది అక్కగారు. చేతిలో వున్న అక్షతలు రవణయ్యతలమీద వేసి, నూరేళ్ళు బతకమని దీవించింది.

"ఇంకా నలభైయ్యేళ్ళు బతకమంటావా అక్కయ్యా?" అన్నాడు రవణయ్య. చెమ్మగిలిన కళ్ళను తుడుచుకొన్నది ఆవిడ తన మరదలు చిన్నతనంలోనే పెనిస్త్రీగా చనిపోయింది.

రవణయ్య బజారుకని వీథిలో నడక ప్రారంభించాడు. చిన్నప్పట్నుంచీ తను ఇదేదారిన నడిచాడు. అయితే ఆ దారికి ఇరుప్రక్కలావున్న ఇళ్ళుమాత్రం కొన్ని గుర్తుపట్టడానికి వీలు లేకుండా మారాయి చితికిన కుటుంబాల ప్రహారీగోడలు పగుళ్ళిచ్చి, వాటిల్లో మొక్కలు లేచాయి. కొన్ని పడిపోయిన యిళ్ళస్థానంలో కొత్తఇళ్ళు లేచాయి. అక్కడక్కడా కొన్ని - చల్లారిన సంసారాలను జ్ఞాపకంచేస్తున్న మొండిగోడలున్నాయి. ఒక సుదీర్ఘ స్వప్నంలా, ఒక నిరంతర సంఘర్షణలా, ఎడతెగని ప్రవాహంలా గతం అతని కళ్ళముందు నీడలు సాగుతున్నది.

రవణయ్య వెంకట్రాజుగారింట్లోకి నడిచాడు. వీధి సావిట్లో రాజుగారు కూర్చుని మిత్రులతో మాట్లాడుతున్నారు. రవణయ్యను చూడగానే కుశల ప్రశ్నలు వేసి, తన కుమారుడు రంగయ్యకు కలిగిన పుత్ర ప్రాప్తిని గురించి తెలియజేసారు.

"శుభం! రంగయ్య బాబు ఎంతవాడైనాడు. నా కళ్ళ ముందు పుట్టి పెరిగినాడు. నాదగ్గర చదువుకున్నాడు. తరువాత పెద్దచదువులు చదివి పెద్ద ఉద్యోగస్తుడయ్యాడు. ఇప్పుడు సంతానప్రాప్తికూడా కలిగింది. ఈ పెత్తనంలో రాజుగారూ తమకు ఇంతకన్న కావలసింది మరోటి ఏముంటుంది" అన్నాడు రవణయ్య.

"నిజమే పంతులుగారూ, అంతా పరమేశ్వరుని కృప. ఏం ఇలా వచ్చారు పెద్దలు ?"

"ఏమని చెప్పను పెద్దయ్యగారూ, రోజులు గడవడం దుర్లభంగా వుంది."

"ఏం పెన్షను రాదా మీాకు ?"

"పింఛనీ లేదు గింఛనీ లేదు. గవర్నమెంటు నౌఖరీ గన కనా. ఇప్పుడంటే బడి పెద్దదైనందువల్ల ప్రభుత్వం నడుపు తున్నది గానీ అప్పుడేముందయ్యా వీధిబడే నాయిరి ?"

"ఓహో! అవును మరి. కలిగినవాళ్ళకే కాలం కట కటగా వుంది."

కటకట ఇట్లా గట్లాగని చెప్పలేం బాబూ, మరీ మామూలు వాళ్ళసంగతి...ఒక్క రూపాయి యిప్పిస్తారేమో

వని తమర్నొక్క అడుగుదామని...' రాజుగారి ముఖకవళిక అదోవిధంగా మారడం చూచి రవణయ్య మాట పూర్తి చెయ్యలేక నీళ్ళు నములుతున్నాడు.

ఇంతలో రాజుగారే 'అయ్యో అడక్కండక్కండిగారు ఎర్రటి ఏగానీ లేదు. చెప్తే నమ్మరుగాని' అని అంటుండగానే లోపలినుంచి రాజుగారి అబ్బాయి రంగయ్యబాబు వచ్చారు. “అబ్బాయి పెద్ద ఉద్యోగస్థుడయ్యాడు. ఏం బాబూ పట్నంలో అంతా సదుపాయంగా ఉంటుందా ?” అని పలకరించాడు రవణయ్య.

“ఏం ఉద్యోగాలు పంతులుగారూ, పేరు గొప్ప, ఊరు దిబ్బ...” అన్నాడు రంగయ్యబాబు వొంకులు తిరిగి ముఖం మీద పడుతున్న క్రాపును మునివేళ్ళతో సవరించుకుంటూ.

“సరే వస్తాను బాబూ సెలవు...” అని రవణయ్య మళ్ళీ వీధిన నడక ప్రారంభించాడు. తూరుపెటూ పడమరెటూ అని తర్కించుకొంటూ అడుగు తీసి అడుగు వేస్తున్నాడు. సంపన్న కుటుంబీకుడుగదా అని రామన్న పంతుల్ని అడిగి చూచాడు. సాటివాడు, ఎన్నడూ నోరు తెరచి అడగని. వాడు అడిగాడన్న మాట కూడా లేకుండా చిల్లిగవ్వ దొంకదని కట్టెవిరిచినట్టు చెప్పాడు రామన్న పంతులు. అంతటితో లేదన్నవాడు ఊరుకుంటే బాగుండిపోను. పుండుమీద కారం చల్లినట్టు, చేతులు నలుపుకుంటూ కూర్చొనకపోతే ఏదన్నా పని చేసుకోకూడదూ అని సలహా యిచ్చాడు.

ఎండ నెత్తికెక్కుతున్నది. మరిద్దర్ని అడిగి చూచాడు గానీ లాభం లేక పోయింది, రచ్చబండ దగ్గర వేపచెట్టు నీడన క్షణంపాటు నిల్చున్నాడు. ఆ పక్కనే సాలె పద్దయ్య పడుగు పోస్తున్నాడు. చిక్కు పడుతున్న ఒక్కొక్క పోగూ ఓపికతో సవరిస్తున్నాడు. చెట్టునీడలో మధ్య మధ్యన దీవులలా పడుతున్న ఎండ పొడలలో నుంచి పద్దయ్య నడుస్తున్నప్పుడు బక్కచిక్కినా నల్లటి అతని విగ్రహం సురసురమంటున్న మింటి వెలుగులో ధగధగ మంటున్నది. చెట్టునీడన తెలుపులు వారకట్టి నట్టుగా వున్నాయి. పోగులు అల్లుతమారం ఆపి, పద్దయ్య పంతుల్ని చూచి నమస్కరించాడు. జరుగుబాటు ఎట్లావుంటున్నదని అడిగాడు పంతులు పద్దయ్యని. "ఏం బాబూ ఎనకటి రోజులు మళ్ళీ రావు. చీరెలిస్తేమటుకు డబ్బు సమయానికి చేతికిస్తారా బాబూ వర్తకులు?" అన్నాడు. అవును, ఉన్నవాళ్ళయినా, లేనివాళ్ళయినా ఇవ్వాలిసిన డబ్బే సమయానికివ్వరు! ఇంక ఊరికే ఇమ్మంటే ఎవరిస్తారు? ఈ నాటికీ తను ఏదో ఒకపని చేసుకుంటూనే వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా రోజులు గడుపుకొస్తున్నాడు తన వంట్లో జవసత్వాలు ఉడగనంతవరకూ ఎంత వయస్సు వచ్చినా పని చేసుకుంటేనే తప్ప దినాలు గడవ్వని అతనికి తెలుసు. అయినా ఎందుకో ఇవ్వాళ తొలిసారిగా చెయ్యిచాచి నలుగుర్ని అడిగి లేదనిపించుకున్నాడు. డబ్బులు దొరకనందుకు తనకు కష్టమనిపించ లేదు. ఈ డబ్బుకూ మానవ సంబంధాలకూ సాన్నిహిత్యమున్నదేమోనన్న సందేహం తన్ను కలతపరుస్తున్నది. రూక చూడకుండా అతను ఎంతో కాలం హాయిగా గడిపాడు.

డబ్బుకూ మనిషికీ ఇంత అతుకు ఉన్నట్టయితే, అదే నిజమైనట్టయితే మానవ సమాజం ఎంతో దుస్థితికి దిగజారినదన్న మాట!

తను చిన్నతనం నుంచీ తోటి మానవుల ఆదరాభిమానాల మధ్య పెరిగి దారిద్ర్యాన్ని గురించి ఎప్పుడూ చింతించ లేదు. పిల్లల్ని వాత్సల్యంతో చూపి, తన చేతనైనంత చక్కగా విద్యాబుద్ధులు చెప్పాడు

ఊళ్ళో నలుగురూ తన్ను యథాశక్తిని ఆదుకున్నారు. ఈ పల్లీయులు అందరూ రాగద్వేషాల మధ్య, సుఖ దుఃఖాల మధ్య, కామక్రోధాల మధ్య పడి నలుగుతున్నప్పటికీ యీ నిరంతర జీవన సంగ్రామంలో వాళ్ళ మనస్సులు అంత మార్పు చెందలేదు. తామర తంపరలా నలుగురూ కలిసికట్టుగానే జీవిస్తూవచ్చారు. అటువంటిది ఈనాడు—కొత్తపరిస్థితులలో 'డబ్బు' మానవ సంబంధాలను ఇంత కలుషితం చేయగలదన్న సందేహం రావడంతో అతని మనస్సు వికలమైపోయింది. ఏనుగులు త్రొక్కనటు విలయంగా వచ్చిన తుపానుకు ఆ కొలనులోని తామరలుమటుకు ఛిన్నాభిన్నం కాక తప్పుతుందా? ఇంతకుముందు ఎన్నడూ అతను ఇంత నిస్పృహను అనుభవించలేదు. కాలం క్రీడలా గడచిపోతుం దనుకున్నాడు! తను మరో ప్రమేయం లేకుండా బ్రతుకు రథం యీడ్చుకొస్తున్నాడు. ఇంతకాలం తామరాకు మీది నీటి బొట్టున్న రోజులు గడుపుకొచ్చాడు.

మళ్ళీ మడమటి వీధి మలుపు తిరిగి, కండువా చెరుగు నెత్తిమీదిది సవరించుకొని రెండడుగులు ముందుకు వేసాడో లేదో..."ఏమండీ రమణయ్యగారూ, రండి...రండి.. లోపలికి దయచెయ్యండి..." అని అకస్మాత్తుగా ఒకపిలుపు వినిపించింది. ఇంతలో అవధానే వచ్చి కేలుపట్టుకొని ఇంట్లోకి తీసుకెళ్ళాడు.

"ఏం ఇంత ఎండలో ఎక్కడనుంచి రాక...ఏదైనా పనిమీద వెళ్తున్నారా?" అన్నాడు. "లేదండీ ఇంటికే" నన్నాడు రమణయ్య. ఏది చెబితే బాగా అతుకుతుందోనన్న ఆలోచన మీదికి పోయింది అతని మనసు. అతన్ని అడిగి వెధవ రూపాయి డబ్బులకు మర్యాద పోగొట్టుకోవడం ఏమాత్రం హితమనిపించలేదు పంతులికి. అవధాని ఆదరంగా పలకరించాడు. అంతకంటె ఏం కావాలి?

"రమణయ్యగారూ మంది జాస్తి అయినకొద్దీ మజ్జిగ పలచనైనట్టు, బడిలో చదువులు పలచబారుతున్నాయి. పిల్లలకు సరిగా ఒక్క ముక్కన్నా చెప్పిన పాపాన పోవడం లేదు. మీరు కాస్త రోజుకో గంట ప్రైవేటు చెప్పగలరేమోనని ఇన్నాళ్ళ బట్టి అడగాలనుకుంటుంటే ఇంత వరకూ తటస్థపడింది కాదు..." అన్నాడు అవధాని.

"పిల్లల్ని నలుగుర్నీ చేరదీసి పాఠం చెప్పడం కంటే సుఖం మరోటి ఎక్కడ వుంది? అదొక్కటే అక్కరకొచ్చేపని. తప్పకుండా చెబుతా" నన్నాడు పంతులు.

"శుభస్య శీఘ్రం ఇవ్వాళే ప్రారంభించండి" అన్నాడు అవధాని.

అంతప్పుడు తన దగ్గర అక్షరాలు నేర్చుకున్న వాళ్ళు పచ్చటి చెట్లల్లో పైకి ఎక్కివచ్చి నలుగురిలోనూ అవును అనిపించుకోవడం తనకు అదే మహానందంగా వుంది. ఇప్పుడు తనకి వాళ్ళు అడిగితే ఇవ్వలేదన్నా చింతా లేదు. ఆడబ్బులు రాకపోతే రాగల ముప్పూ లేదు. అవతలి గట్టున నిల్చుని ఎత్తుమీదనుంచి చూస్తున్నాడు, ప్రతిదాన్నీ. మంచి చెడ్డల్ని నిరక్షీర న్యాయంగా విడమరచి చూడాలి. అట్లాంటి పక్షి చూపుతో చూస్తే కాల ప్రవాహంలో కొట్టుకపోకుండా కాలు నిలద్రొక్కుకోవచ్చు.

ఇంటికి వచ్చేసరికి తనకి జ్ఞాపకం వచ్చింది షష్టిపూర్తి మాట. తనలో తనే నవ్వుకొన్నాడు.

ఆ సాయంత్రం అవధానిగారి అరుగుమీద బాసిపట్టు వేసుక కూర్చుని, డిక్టేషన్ వ్రాయిస్తున్నాడుపిల్లలచేత. మంథర రాముడికి ఎట్లా చందమామను నిలువు టద్దంలో పెట్టి తెచ్చి యిచ్చిందీ.

చిన్ననాడు ఆయన విసిరేస్తే దిగిరాని బంతిలా పైన వెలుగుతున్నది చందమామ. ఆ వెలుగులోనే పిల్లలు వ్రాస్తున్న పంక్తి పంక్తీ ముత్యాలకోవలా మిల మిల మంటున్నది.

Blank Page

Blank Page

118
066

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

జననం 1923 లో. విజయనగరంలో. చదివినది బి. ఏ., ఎల్. ఎల్. బి. 1948 నుండీ పత్రికారచనే వృత్తి. ప్రస్తుతం న్యూఢిల్లీలోని టాస్ వార్తాసంస్థ సంపాదక వర్గంలో పనిచేస్తున్నారు. చాలా కథలు, కొన్ని నాటికలు, వ్యాసాలు వ్రాశారు. వీరి 'దొంగలున్నారు జాగ్రత్త' అనే కథానికకు ప్రపంచ కథానికల పోటీలో భారతదేశంలో ద్వితీయ బహుమతి వచ్చింది.

119

MaNaSu Foundation - Check List

Book Number	CP-03-C-189
Front Cover	Yes
Back Cover	Yes
Blank Pages	CI, 116, 117
Missing Pages	1 to 8
Remarks	—